నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 26 జూలై 2024 | ADILABAD NIRMAL

కేసీఆర్‌తో కలిసి అసెంబ్లీకి వస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్యేలు

అధినేతతో కలిసి అసెంబ్లీకి..

నేరడిగొండ, జూలై 25 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కలిసి ఎమ్మెల్యే జాదవ్ అనిల్ గురువారం అసెంబ్లీకి వెళ్లారు. ముందుగా కేసీఆర్‌కు పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్నారు.

గురుకుల నిర్వహణపై కేసు

వంగిన బెడ్స్‌ను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య

- విద్యార్థికి పాముకాటుపై స్పందించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య
- సుమోటాగా తీసుకుని పీఎల్‌సీ కింద నమోదు
- గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాల తనిఖీ
- పరిసరాల అపరిశుభ్రతపై అసంతృప్తి
- ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం
- పరిస్థితి మారకపోతే నోటీసులు ఇస్తామని హెచ్చరిక

ఎదులాపురం, జూలై 25 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థి పాముకాటుకు గురికావడం, గురుకులం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సుమోటాగా తీసుకుని గురుకులంపై పీఎల్‌సీ కింద కేసు నమోదు చేశామని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య తెలిపారు. ఈ మేరకు గురువారం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. పాముకాటుకు గురైన స్థలాన్ని పరిశీలించారు. వంటశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం విద్యార్థులు ఈగలు, అపరిశుభ్రత ప్రదేశం, తరగతి గదిలోని బెంబీలు, పడుకునే బెడ్స్‌పై కూర్చుని భోజనం చేస్తు ఉండడాన్ని గమనించారు. విద్యార్థులు పడుకునే గదుల వద్ద అపరిశుభ్రంగా ఉండడం, దుర్వాసన వస్తుండడంతో ప్రిన్సిపల్ అనిల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల తరువాత మళ్లీ వస్తా అని, ఆలోపు గుర్తించిన లోపాలను సవరించుకుని, రిపేర్లు, మరమ్మతులు చేయాలని సూచించారు. పరిస్థితి మారకపోతే నోటీసులు ఇవ్వడంతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. పక్కనే ఉన్న వైటీసీ భవనంలో పిల్లలకు తాత్కాలికంగా వసతి కల్పిస్తే బాగుంటుందని ప్రిన్సిపాల్ తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులకు లేఖ రాస్తామన్నారు. పాముకాటుకు గురైన విద్యార్థి జాదవ్ సిద్ధు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ప్రిన్సిపల్ ద్వారా తెలిసిందన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

టేకం లక్ష్మణ్(ఫైల్)

ఉట్నూర్ రూరల్, జూలై 25 : బొప్పరికుంట గ్రామానికి చెందిన టేకం లక్ష్మణ్(28) గంగాపూర్ వాగులో శనివారం గల్లంతయ్యాడు. ఐదు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టగా గురువారం వాగులో చెట్టు కొమ్మకు తట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించామని ఎస్సై మనోహర్ తెలిపారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 25 : ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం ధరణి, ప్రభుత్వ స్థలాల రక్షణ, వివిధ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, చెరువుల భూములు ఆక్రమణకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్రమణ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో సూర్యారావు పాల్గొన్నారు.

భట్టి బడ్జెట్‌పై పెదవి విరుపు

- అన్ని రంగాలను విస్మరించిన కాంగ్రెస్ 'పద్దు'
- ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై అలసత్వం
- అభివృద్ధి, సంక్షేమానికి నిధుల మంజూరులో నిర్లక్ష్యం
- గిరిజన సంక్షేమానికి అరకొర నిధులే..
- దళితబంధు, కులవృత్తుల ఊసేలేదు..
- రైతుబంధుపై స్పష్టత కరువు
- మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం ఏదీ?
- పెంచుతామన్న పింఛన్లపై నో ప్రకటన
- నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు..

ఆదిలాబాద్/నిర్మల్, జూలై 25(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలను విస్మరించిందని మండిపడుతున్నారు. ప్రధానంగా వ్యవసాయం, నీటి పారుదల, గిరిజనాభివృద్ధి, రహదారులు, విద్యా రంగాలకు నిధుల మంజూరులో నిర్లక్ష్యంగా వ్యవహరించిదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని 51 వేల ఎకరాలకు సాగునీరు అందించే చనాక-కొరాట ప్రాజెక్టు, పిప్పల్‌కోటి ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు, కుప్టి ప్రాజెక్టు మంజూరు విషయంలో అలసత్వంగా వ్యవహరించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజనుల సంక్షేమానికి అరకొర నిధుల మంజూరు ఫలితంగా అభివృద్ధిపై ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొంటున్నారు. రవాణా వ్యవస్థను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ప్రస్తావన కనిపించలేదు. ప్రత్యేక కేటాయింపులు జరపకపోవడంతో పెండింగ్ ప్రాజెక్టుల పనులకు ఆటంకం కలుగడంతోపాటు అభివృద్ధి జరగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మత్స్యకారులు, గొల్ల కుర్మలు, బీసీలు, దళితులను పూర్తిగా విస్మరించారని మండిపడుతున్నారు. దళితబంధు ఊసే లేకపోవడంతో ఆ పథకాన్ని రద్దు చేసినట్లేనని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు డబ్బులు రాకపోవడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. రైతుభరోసాపై స్పష్టత ఇవ్వకపోవడం అయోమయానికి గురి చేస్తున్నది. బీసీల సంక్షేమాన్ని విస్మరించిందన్న విమర్శలు ఉన్నాయి. మౌలిక రంగాలకు కూడా అరకొర నిధులు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుభవ రాహిత్యం తేటతెల్లమైందని వివిధ వర్గాల ప్రజలు పేర్కొంటున్నారు.

భరోసా ఇవ్వని బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భరోసా కల్పించేలా లేదు. అభివృద్ధి, సంక్షేమ రంగాలను పూర్తిగా విస్మరించింది. ఏ ఒక్క వర్గానికి న్యాయం చేసేలా నిధుల కేటాయింపు కనిపించడం లేదు. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కులవృత్తులకు ప్రోత్సాహం, మహిళా సంక్షేమం, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాలపై స్పష్టత లేదు. మొత్తంగా రైతు వ్యతిరేక ప్రభుత్వం అనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- జోగు రామన్న, మాజీ మంత్రి

జిల్లాను దత్తత తీసుకుంటామని నిధులు ఇవ్వలేదు..

బడ్జెట్‌లో అంకెలగారడీ తప్ప ఏమీ లేదు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకించి నిధులు కేటాయించలేదు. డబ్బులు ఇవ్వకుండా జిల్లా అభివృద్ధి ఎలా చేస్తారు? జిల్లాలోని చనాక-కొరాట, పిప్పల్‌కోటి ప్రాజెక్టులకు నిధులు లేవు. కుప్టీ, గోముత్రి ప్రాజెక్టులను మంజూరు చేయలేదు. గిరిజనాభివృద్ధికి ప్రణాళికలకు లేవు. రహదారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంలో ప్రస్తావన లేదు. ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటి అమలుతీరుపై స్పష్టత ఇవ్వలేదు. అభివృద్ధి, సంక్షేమ రంగాలను పూర్తిగా విస్మరించారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, రవాణ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు.

- అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

అప్పుల కుప్ప

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిండా అప్పులే ఉన్నాయి. రాష్ట్ర అప్పులను మరింతగా పెంచేలా బడ్జెట్ ఉంది. రూ.62 వేల కోట్ల అప్పులు చేస్తున్నట్లు గొప్పగా చెప్పుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో అప్పులు చేస్తున్న ప్రభుత్వం అభివృద్ధికి వెచ్చిస్తున్నది మాత్రం కేవలం రూ.33 వేల కోట్లే. ఈ నిధులతో ఏ విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందో ఆ పార్టీ నాయకులకే తెలియాలి. బడ్జెట్‌లో నిర్మల్ జిల్లా అభివృద్ధికి నయాపైసా కేటాయించలేదు. అలాగే బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. నెలకు రూ.4 వేలు ఇస్తామని కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించింది. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ ఏమైంది. ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేలా ఉన్నది.

- భుక్యా జాన్సన్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి

దళితబంధు కొనసాగింపుపై అనుమానాలు

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించేలా కనిపించడం లేదు. బడ్జెట్‌లో ఈ పథకం ఊసే లేదు. ఇదే జరిగితే దళితుల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికాక తప్పదు. అలాగే పేద మహిళల కోసం గృహలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో ఈ పథకానికి రూపాయి కూడా కేటాయించలేదు. చేయూత పథకం కింద నెలకు రూ.4 వేలు ఇస్తామన్నారు. ఇందుకు అవసరమైన నిధులను కూడా కేటాయించలేదు. ఇప్పటి వరకు కేసీఆర్ ఇచ్చిన పింఛనే వస్తున్నది. మోసపూరిత హామీచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తొందరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారు.

- లోలం శ్యాంసుందర్, ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ఏబీవీపీ నాయకులు

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనంను చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎదులాపురం, జూలై 25 : పెండింగ్ లో ఉన్న రూ.7 వేల కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ 11 మంది పాల క మండలి సభ్యులలో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఒకరిని కూడా నియమించకపోవడం విడ్డూరమన్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి కూడా సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో అశాస్త్రీయంగా పెంచిన పీజీ, ఇంజినీరింగ్ కోర్సుల ట్యూషన్, ఎగ్జామ్ ఫీజులను తగ్గించాలన్నారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిఖిల్, విఘ్నేశ్, కార్తీక్, శ్రీశాంత్, యష్, సాయి, ఆదిత్య పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం

ఆదిలాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్‌పై ఏడుగురు ఉపాధ్యాయులను నియమిస్తూ జిల్లా విద్యాధికారి ప్రణీత ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వివిధ పాఠశాలల నుంచి డిప్యూటేషన్లపై ఉపాధ్యాయులను నియమించగా వారి నియామకంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు పైరవీలు చేసుకున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌లు ఇచ్చారంటూ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. అక్రమ డిప్యూటేషన్‌లను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం మరో నోటిఫికేషన్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఉట్నూర్ జడ్పీఎస్ఎస్‌లో ఇంగ్లిషు స్కూల్ అసిస్టెంట్ మతీన్, తలమడుగు జడ్పీఎస్ఎస్ నుంచి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్, నార్నూర్ జడ్పీఎస్ఎస్ గణితం స్కూల్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్, ఉట్నూర్ జడ్పీఎస్ఎస్ బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఈశ్వర్, లోకారి ఎంపీయూపీఎస్ తెలుగు స్కూల్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి, కచ్‌కంటి ఎంపీయూపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న రమాదేవి, కోకస్‌మన్నూర్ ఎంపీపీ ఎస్జీటీ సంతోష్‌లను డిప్యూటేషన్లపై నియమించారు. పాఠశాలలో ఇటీవల డిప్యూటేషన్లపై నియమించిన ముగ్గురి నిమాయకాలను రద్దు చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

జైనథ్, జూలై 25 : గిమ్మ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై వి.పురుషోత్తం తన సిబ్బందితో కలిసి దాడి చేరని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు. ఇందులో పేకాట ఆడుతున్న నరేందర్, రమేశ్, కిషన్, రామన్న, గౌరన్న, పరమేశ్వర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.14,580 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే 8712659916, 8712659929కు సమాచారం అందించాలని సూచించారు.

స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ

స్వర్ణ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సారంగాపూర్, జూలై 25 : స్వర్ణ ప్రాజెక్టును బుధవారం ఎస్పీ జానకీ షర్మిల సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గేట్లు వదిలేటప్పుడు ఆయా గ్రామాల ప్రజలకు సమాచారం అందించాలని అధికారులకు చెప్పారు. ఆమె వెంట ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ మధుపాల్, దేవేందర్, ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

గేటు ఎత్తివేత

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు స్వర్ణ ప్రాజెక్టుకు వరద తాకిడి పెరిగింది. దీంతో బుధవారం ఇరిగేషన్ అధికారులు 4వ గేటు ద్వారా వరద నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు నీటి మట్టం 1183 అడుగులు కాగా.. 1180.1 అడుగులకు చేరడంతో నీటిని దిగువనకు వదిలిపెట్టారు. 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఔట్ ఫ్లోగా 3వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కరంజి(టి)కి రోడ్డు నిర్మాణం చేపడుతాం

కలెక్టర్ రాజర్షి షా

భీంపూర్, జూలై 25 : ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) వరకు 50 కిలోమీటర్ల రోడ్డు మంజూరైందని, వర్షాలు తగ్గిన తర్వాత పనులు చేపడుతామని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. కలెక్టర్ గురువారం భీంపూర్, అర్లి(టి) ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. అర్లి(టి) ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు ఇప్పుడే ప్రత్యేక తరగతులు ప్రారంభించటం హర్షణీయమన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. భీంపూర్, అంతర్గాం పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయిస్తామన్నారు. అంతకు ముందు సెంటర్ సాంగ్వి, భీంపూర్ శివారులో పంటల నమోదు ప్రక్రియను పరిశీలించి సూచనలు చేశారు. రైతుల కష్టనష్టాలను తెలుసుకున్నారు. అర్లి(టి)లో గ్రామాభివృద్ధి కమిటీ, ఎంప్లాయీస్ యూనియన్ చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట డీఏవో పుల్లయ్య, డీపీఆర్వో తిరుమల, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఏవో రవీందర్, డీఐవో రవీందర్, ఏపీడీ కుటుంబరావు, ఏఈవోలు శంకర్, వికాల్, సాయిప్రణీత, హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి,

అర్లి గ్రామీణ బ్యాంకులో వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

ఉపాధ్యాయులు శ్రీకాంత్, విజయలక్ష్మి, ఏపీవో సంగీత, అటవీశాఖ అధికారి గులాబ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్, ఓమయ్య, సంతోష్, నితీన్, కపిల్, బక్కన్న ఉన్నారు.

రుణమాఫీ వేగంగా చేయాలి..

ప్రభుత్వం అమలు చేసే రుణమాఫీని బ్యాంకు అధికారులు శ్రద్ధగా, ఓపికగా, వేగవంతంగా అమలు చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టర్ అర్లి(టి) సరస్వతి గ్రామీణ బ్యాంకును సందర్శించారు. అక్కడ రుణమాఫీ ప్రక్రియను నిశీతంగా పరిశీలించారు. ఇతర బ్యాంకు పనులు ఏవీ ఉన్నా రుణమాఫీ ప్రక్రియ కొనసాగించాలని బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లకు చెప్పారు. అవసరమైతే సిబ్బంది బ్యాంకులో రెండు గంటలపాటు అదనంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. అర్లి(టి)లో ఆర్వోఎఫ్ఆర్ రైతుల సమస్యలు విన్నారు. మొత్తంగా ఎడతెరిపిలేని వర్షంలో కలెక్టర్ నాలుగు గంటలపాటు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. రైతుల పంటల నమోదు, బీమా అంశాలు గడువులోగా పూర్తి చేయాలని వ్యసాయాధికారులను ఆదేశించారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

డీఎస్పీ గంగారెడ్డి

మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ అర్బన్, జూలై 25 : ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ప్రమాద రహిత వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. ఈనెల 30 వరకు ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. రోడ్డు నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.